క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



స్వీపర్ కొండయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్ కల్యాణ్

కె.గంగవరం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పంచాయతీ స్వీపర్ తాతపూడి కొండయ్య కుటుంబానికి గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు పిల్లి కల్యాణ్ ఆర్థిక సహాయం అందించారు. కొండయ్య గత 30 సంవత్సరాలుగా పంచాయతీకి సేవలు అందిస్తూ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామ పెద్దలు కాదా గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆధునీకరణ



పడమర ఖండ్రిక శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన సత్యహరిశ్చంద్ర విగ్రహాలు

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రికలోని శ్మశానవాటికను అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజల సంయుక్త ఆధ్వర్యంలో ఆధునీకరిస్తున్నారు. వాటికలో దహన సంస్కారాలు జరుపుకునేందుకు వీలుగా సీసీ రహదారులను నిర్మించారు. ఇరు గ్రామాల్లోని కొందరు చొరవతో పలు ఘట్టాలను ప్రతిబింబించే సిమెంటు శిల్పాలను ఏర్పాటు చేస్తున్నారు. పడమర ఖండ్రికకు చెందిన జముల సత్యనారాయణ, కవల శ్రీనులు సంయుక్తంగా సత్యహరిశ్చంద్ర విగ్రహాలను ఏర్పాటు చేశారు. వారిని పడమర ఖండ్రిక సర్పంచ్ తిరునాటి ఆదిలక్ష్మి, వెంకటేశ్వరరావు దంపతులు అభినందించారు.

దంత వైద్య పరీక్షలు

రామచంద్రపురం రూరల్: ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ద్రాక్షారామలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. భీమేశ్వర దంత వైద్యశాల అధినేత డాక్టర్ బచ్చు క్రాంతికుమార్ ఆటో డ్రైవర్లకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

మొదటి విడత 'సుఖీభవ' చెల్లింపునకు ఏర్పాట్లు

కపిలేశ్వరపురం: ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం 'అన్నదాతా సుఖీభవ, పీఎం కిసాన్' వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని చెల్లించేందుకు సిద్ధమైంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిపైబడినప్పటికీ ఒక్కసారి కూడా రైతుకు సాయం అందించలేదు. కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం కిసాన్ పథకం రూ.2000, రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా రూ.5,000 చొప్పున రైతు ఖాతాకు జమ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం కిసాన్ పథకం ద్వారా మండపేట మండలంలో 5,334 మంది రైతు కుటుంబాలకు రూ.1,06,68,000, కపిలేశ్వరపురం మండలంలో 6,878 మంది కుటుంబాలకు రూ.1,37,56,000, రాయవరం మండలంలోని 4,684 మంది కుటుంబాలకు రూ.93,68,000 నియోజకవర్గం మొత్తం 16,896 మందికి రూ.3,37,92,000 ఖాతాలకు జమకానుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మండపేట మండలంలో 5,694 మంది రైతు కుటుంబాలకు రూ.2,84,70,000, కపిలేశ్వరపురం మండలంలో 7,445 మంది కుటుంబాలకు రూ.3,72,25,000, రాయవరం మండలంలోని 5,090 మంది కుటుంబాలకు రూ.2,54,50,000 నియోజకవర్గం మొత్తం 18,229 మందికి రూ.9,11,45,000 ఖాతాలకు అన్నదాతా సుఖీభవ సొమ్ము జమ కానుంది.

బీసీలను అవమానించిన వ్యక్తిపై ఫిర్యాదు



సీఐ వెంకట నారాయణకు ఫిర్యాదు చేస్తున్న శెట్టిబలిజ సంఘ నాయకులు

రామచంద్రపురం: బీసీ మహిళలను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన కె.గంగవరం మండలం మసకపల్లి గ్రామానికి చెందిన రవ్వా భూషణంపై తగిన చర్యలు తీసుకోవాలని రామచంద్రపురం శెట్టిబలిజ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం రామచంద్రపురం డీఎస్పీ, సీఐ, ఎస్సైలకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ లేకపోవడంతో ఆయన కార్యాలయంలో ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ నేతలు కట్టా సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు, పాలిక అప్పారావు, కంచి సత్యానందం, రెడ్డి జయరాజ్, మేడిశెట్టి గోవిందు, బొక్కా భానుమూర్తి, కడలి రాంపండు, నరాల శ్రీను, గీసాల గోపి, వల్లు శివ, కట్టా గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నారుమడి.. జాగ్రత్తలతో దిగుబడి

- ఖరీఫ్ సాగు పనుల్లో రైతులు నిమగ్నం
- అప్రమత్తంగా లేకుంటే దిగుబడిపై ప్రభావం
- సస్యరక్షణ చర్యలతో మంచి ఫలితాలు



కాజులూరులో ఆశాజనకంగా ఉన్న నారుమడి



అంద్రంగిలో నారుమడి తయారీపై రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

కాజులూరు: నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. రైతులు వరిసాగు పనుల్లో బిజీగా ఉన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో రైతులు వరి నారు పోశారు. ఖర్చులు తగ్గించుకొని వ్యవసాయం లాభసాటిగా మార్చుకోవడానికి ఆరోగ్యవంతమైన నారే కీలకం. ఆరోగ్యకరమైన నారు కోసం నారుమడి తయారీ నుంచి పలు జాగ్రత్తలు, అప్రమత్తత అవసరం. నారు దశలో నిర్లక్ష్యంగా ఉంటే పంట దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నారుమడి తయారీ సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

52 వేల ఎకరాల్లో వరి సాగు

నియోజకవర్గంలో 67 వేల ఎకరాలు సాగుభూమి ఉంది. ఈ ఏడాది తొలకరిలో 52 వేల ఎకరాల్లో రైతులు రైతులు వరి సాగు చేస్తున్నట్టు అధికారుల అంచనా. ఖరీఫ్ ప్రారంభం నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవటంతో నియోజకవర్గంలో ఈ ఏడాది వరిసాగు ఆలస్యమైంది. ప్రస్తుతం నియోజకవర్గ గ్రామాల్లో కొన్ని చోట్ల నాట్లు ప్రారంభమవ్వగా అధిక శాతం రైతులు నారుమడుల తయారీ, విత్తనాలు చల్లుకోవడం, నారు సంరక్షణ పనుల్లో బిజీ బీజీగా ఉన్నారు.

నారుమడి తయారీలో పాటించాల్సిన జాగ్రత్తలు

నారుమడి చేయడానికి ఎంచుకున్న పొలం మెరకలో ఉండి సారవంతమైనదిగా ఉండాలి. పొలాన్ని బాగా దుక్కి చేసి కలుపు లేకుండా చూసుకోవాలి. వీలైనంత వరకూ సేంద్రియ ఎరువును ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. దీంతో వేరు వ్యవస్థ బలంగా తయారై నారు తీసేటప్పుడు వేర్లు తెగిపోవు. మొక్కకు అన్నిరకాల పోషకాలు పుష్కలంగా అంది నారు ఆరోగ్యవంతంగా పెరుగుతుంది. నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో మూడుసార్లు దమ్ముచేసి చదును చేసి నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.



మొగలిపాలెంలో కలుపు నివారణ మందు పిచికారీ చేస్తున్న రైతు

ఎకరాకు 5 సెంట్ల నారుమడి

ఎకరా పొలంలో నాట్లు వేయడానికి 5 సెంట్ల నారుమడి సరిపోతుంది. 5 కిలోల విత్తనాలను గ్రాము కార్బన్డిజం కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టి, మొలకలు వచ్చిన తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. ఆకులు పూర్తిగా విచ్చుకునే వరకూ ఆరుతడులు ఇచ్చుకోవాలి. నారు మడిలో ఇనుపధాతు లోపం కనిపిస్తే లేత చిగురు ఆకులపై ఇటుక రంగు మచ్చలు ఏర్పడి నారు నిర్జీవంగా మారి ఎదుగుదల ఉండదు. దీని నివారణకు లీటరు నీటిలో 20 గ్రాముల అన్నబేధి, 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపిన ద్రావణం పిచికారీ చేసుకోవాలి.

కలుపు నివారణ ఇలా...

నారుమడిలో కలుపు మొక్కల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి. సాధారణంగా చిన్న కమతాల నారుమడుల్లో కలుపును రైతులు లేదా కూలీలతో తొలగిస్తారు. పెద్ద కమతాల రైతులు మాత్రం కలుపు నివారణకు రసాయనాలు ఉపయోగించవచ్చు. నారుమడిలో ఊద, ఇతర కలుపుజాతి ఉంటే నివారణకు ఎకరా నారుమడికి 400 మిల్లీ లీటర్ల సైహలోఫాస్ బ్యూటైల్ 10 శాతం మందును 200 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ మందు పిచికారీ చేసిన వారం రోజుల్లో ఊద, గడ్డి జాతి మొక్కలు మాత్రమే నశిస్తాయి. నారుకు ఎలాంటి నష్టం ఉండదు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



విత్తిన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరా నారు మడికి 160 గ్రాముల చొప్పున వేసుకోవాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా క్లోరిఫైరిపాస్ 2.0 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి విత్తిన 10రోజులకు 17రోజులకు పిచికారీ చేసుకోవాలి. నారు తీయడానికి 7రోజుల ముందు సెంటు నారు. మడిలో 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ 2జి గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచి చల్లుకోవాలి.

వి.అశోక్,
మండల వ్యవసాయాధికారి, కాజులూరు

విజయదుర్గ పీఠంలో శ్రావణ శుక్రవారం పూజలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం రెండవ శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పీఠాన్ని సందర్శించుకున్నారు. పీఠంలోని విజయదుర్గా అమ్మవారికి పురోహితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి సహస్రనామాలతో అర్చన చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీఠంలో అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పీఠంలోని భక్తులకు విజయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. మండలంలో పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. రాయవరం, సోమేశ్వరం, వెంటూరు, చెల్లూరు తదితర ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే పలువురు మహిళలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



సర్వాభరణ భూషితురాలైన విజయదుర్గ అమ్మవారు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు



ద్రాక్షారామలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు



గొల్లపాలెం దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కాజులూరు: శ్రావణమాసంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. మండలంలోని 26 గ్రామాల్లోనూ అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో మహిళలు శ్రావణ శుక్రవారం పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి భక్తులు పోటెత్తారు. ద్రాక్షారామలోని సున్నవారి వీధిలో వేంచేసిన సరస్వతీ దేవి ఆలయం వద్ద సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు.

నిర్మాణరంగ కార్మికుల సమస్యలను విస్మరించిన ప్రభుత్వం

రాయవరం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని సీఐటీయూ జిల్లా కన్వీనర్ జి.దుర్గాప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయవరంలో శ్రీ భక్తాంజనేయ భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద యూనియన్ అధ్యక్షుడు కర్రి తాతారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మండల శాఖ అధ్యక్షురాలు డి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించలేదన్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఐదుసార్లు కలిసి వినతిపత్రం అందించినా స్పందన లేదన్నారు. ఇటీవల రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ శాఖ) రాష్ట్ర మహాసభలో తీసుకున్న నిర్ణయం మేరకు సెప్టెంబర్ 15న విజయవాడలోని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాకు పిలుపునిచ్చామని తెలిపారు. ఈ ధర్నాలో భవన నిర్మాణ కార్మికులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మికులందరూ కార్మిక శాఖ కార్యాలయాల్లో భవన నిర్మాణ కార్మికుల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల శాఖ కన్వీనర్ డి.ఆదిలక్ష్మి, టి.వెంకటరామారెడ్డి, బి.దుర్గాప్రసాద్, గండి చంద్రశేఖర్, లంక వెంకట్రాజు, లంక చందు, ఆర్.దివాకర్, బండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రాయవరంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

కపిలేశ్వరపురం: బిడ్డ ఆరోగ్య పరిరక్షణలో తల్లిపాల ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ పరిధిలోని కపిలేశ్వరపురంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ప్రాజెక్ట్ అధికారిణి అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రజలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.రత్నకుమారి, ఐ మాణిక్యం తదితరులు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న ప్రక్రియను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ చిన్నారుల తల్లులు పాల్గొన్నారు. మండపేట రూరల్ మండలం ద్వారపూడిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయకుమారి మాట్లాడుతూ తల్లిపాలలోని పోషకాలను, వాటిని బిడ్డకు అందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, ఎంపీటీసీ సభ్యుడు లోవరాజు, వార్డు సభ్యుడు మాణిక్యాలరావు, హెచ్‌వీ మంగాయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. కేశవరంలో కార్యదర్శి సుబ్బారావు ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు.



ద్వారపూడిలో తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, తల్లులు

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెంలో పంచాయతీ కార్యాలయానికి తెలియపరచకుండా అక్రమంగా కొబ్బరికాయలు తీయించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, పంచాయతీ కార్యదర్శి అరుణలకు ఫిర్యాదు చేశారు. కొబ్బరి చెట్ల ఫలసాయం అనుభవించే హక్కు కోసం శుక్రవారం వేలంపాట నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేయగా గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. గతంలో పాడుకున్న పాటదారుడికి జూన్ 30తో గడువు ముగిసిందని, నిబంధనల ప్రకారం గడువు తేదీకి మూడు నెలల ముందుగా మాత్రమే కొబ్బరికాయలు తీసుకోవాల్సి ఉందన్నారు. గడువు ముగిసిన తరువాత జూలై 9న పంచాయతీ కార్యాలయానికి ఎటువంటి సమాచారం లేకుండా అక్రమంగా సుమారు 4,000 కొబ్బరి కాయలు తీశారన్నారు. మార్కెట్ రేటు ప్రకారం రూ.45,000 రికవరీ చేయాలని, నిందితుడిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. కొబ్బరి కాయలు మళ్లీ తయారు కావడానికి మూడు నెలల సమయం పడుతుందని, ఈ మేరకు వేలం పాటను వాయిదా వేయాలని కోరారు. దీంతో వేలం వాయిదా వేసినట్లు సర్పంచ్ సతీష్‌కుమారి తెలిపారు.



సర్పంచ్ సతీష్‌కుమారి, కార్యదర్శి అరుణకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కుటుంబ సభ్యులకు బాలుడి అప్పగింత

తాళ్లరేవు: ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిన 12 ఏళ్ల బాలుడు ఆచూకీని కోరంగి పోలీసులు కేవలం 6 గంటల వ్యవధిలోనే కనుగొన్నారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని జార్జిపేటకు చెందిన 12 ఏళ్ల మండపల్లి శ్రీరామ్ నీలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. కొన్నిరోజులుగా పాఠశాలకు వెళ్లడం లేదని నానమ్మ వీరమ్మ మందలించడంతో శ్రీరామ్ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బాలుడి కోసం కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో వీరమ్మ కోరంగి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు స్పందించి పలు కోణాల్లో దర్యాప్తు ప్రారంభించి ఆరు గంటల వ్యవధిలోనే కేసును ఛేదించారు. సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా బాలుడు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకుని కోరంగి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. కోరంగి అదనపు ఎస్సై ఎస్.సత్యనారాయణ, రైటర్ ఎస్.వెంకటరమణ సిబ్బంది సహకారంతో కేసును వేగవంతంగా దర్యాప్తు చేయగలిగామని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై, పోలీసులకు బాలుడి కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

గురుకులాల్లో ఉపాధ్యాయుల కొరత

అల్లవరం: గోడిలోని బీఆర్ అంబేడ్కర్ బాలుర, బాలిక గురుకులాల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు డీబీ లోక్ అన్నారు. గోడిలోని బాలుర, బాలిక గురుకులాలను జిల్లా దళిత వేదిక, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం, దళిత మహిళా శక్తి సంఘాల నాయకులు శుక్రవారం సందర్శించారు. బాలుర గురుకులంలో 24 మందికి 8 మంది, బాలిక గురుకులంలో 24 మందికి ముగ్గురు మాత్రమే శాశ్వత ఉపాధ్యాయులున్నారని మిగిలిన వారందరూ కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్నారని పేర్కొన్నారు. రెండు గురుకులాల్లో ప్రిన్సిపాల్స్ లేకపోవడం పర్యవేక్షణ లోపించిందన్నారు. ఇప్పటికీ చాలా మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదని తెలిపారు. మరుగుదొడ్ల నిర్వహణ బాగోలేదని, ఇటీవల ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులను తొలగించడంతో గురుకులాల్లో పారిశుద్ధ్యం లోపించిందని లోక్ అన్నారు. ఫ్యాన్లు తిరగక, లైట్లు వెలగక, దోమల బెడదతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి గురుకులాల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తుప్పలు.. తప్పని తిప్పలు



కోట రోడ్డులో ప్రమాదాలకు నిలయంగా మారిన తుప్పలు

కె.గంగవరం: ఏటిగట్టుపై రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో గత నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోటిపల్లి నుంచి కోట వరకు ఏటిగట్టుపై తుప్పలు ఏపుగా ఎదిగి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రహదారిలో మలుపులు ఎక్కువగా ఉండడం, దీనికి తోడు తుప్పలు రోడ్డు మధ్య వరకు ఎదగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను కనపకడ ప్రమాదాలు జరుగుతున్నాయి. సుమారు మూడు కిలోమీటర్ల మేర తుప్పలు ఏటిగట్టుకు ఇరువైపులా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తుప్పలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

కపిలేశ్వరపురం (మండపేట): ఇప్పనపాడులో ఈ ఏడాది జూలై 16న జరిగిన హత్యకేసులో నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్టు మండపేట రూరల్ ఎస్సై వి.కిశోర్ తెలిపారు. గ్రామానికి చెందిన వాకాడ వీర్రాజు (47) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతుని కుమారుడు ఫిర్యాదుపై కేసు నమోదైంది. తల్లి, సోదరి కలసి తన తండ్రిని హత్యచేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసులో నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి ఆలమూరు కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధించినట్టు ఎస్సై కిశోర్ తెలిపారు.

రహదారులు అస్తవ్యస్తం



ఛిద్రమైన కొండాలమ్మ చింత-మాచర మట్టలు రహదారి

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లోని రహదారులు ఛిద్రమవడంతో ప్రమాదకరంగా మారాయి. రోడ్లపై లోతైన గుంతలు దర్శనమిస్తున్నాయి. కపిలేశ్వరపురం-తాతపూడి గోదావరి గట్టులో పలు చోట్ల గుంతలు పడి ప్రయాణీకులను ప్రమాదం వెంటాడుతోంది. గ్రామాల్లోని రహదారులు పలు చోట్ల గోతులుపడి వాహనదారులకు నరకం చూపుతున్నాయి. అంగర-కపిలేశ్వరపురం ఆర్అండ్‌బీ రహదారిలోని కొండాలమ్మ చింత నుంచి మాచర గ్రామ శివారు మాచరమట్టలు గ్రామానికి వెళ్లే రహదారి ఛిద్రమైంది. కపిలేశ్వరపురం జమీందారు దివాణం నుంచి మాచరమట్టలు రహదారి అధ్వానంగా తయారైంది. ఆయా గ్రామాల రైతులు నిత్యం వ్యవసాయ క్షేత్రాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వ్యవసాయ ఉత్పత్తులను తరలిస్తుంటారు. ఇతర గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులను మెరుగుపర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణ

కాజులూరు: కాకినాడ-కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం గొల్లపాలెం వద్ద శుక్రవారం జరిగిన ప్రమదంలో తణుకువాడకు చెందిన కళా సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జీవనోపాధి కోసం హైదరాబాదులో ఉంటున్న కళా సత్యనారాయణ వృద్ధాప్య పింఛను తీసుకునేందుకు రెండు రోజుల కిత్రం గ్రామానికి వచ్చాడు. శుక్రవారం సాయంత్రం తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకున్నాడు. ఈ క్రమంలో గొల్లపాలెంలో బంధుమిత్రులను కలిసేందుకు వెళుతుండగా సుబ్రహ్మణేశ్వస్వామి గుడి వద్ద గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా ఎస్సై మోహన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కళా సత్యనారాయణ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి పరారైన వ్యక్తి కోసం గాలిస్తున్నామని ఎస్సై మోహన్‌కుమార్ తెలిపారు.

కలెక్టరేట్‌లో స్థల దాతల ఫిర్యాదు

అమలాపురం రూరల్: గ్రామ సచివాలయం, పశు వైద్యశాల, కుటుంబ నియంత్రణ ఉపకేంద్రం కోసం బండారులంకలో తాము దానమిచ్చిన స్థలంలో నిర్మించిన భవనాన్ని వాటికి మాత్రమే ఉపయోగించాలని వేరే ఇతర శాఖల కార్యాలయాలకు ఉపయోగించడానికి అనుమతులు ఇవ్వవద్దంటూ స్థలదాతలు బాసిన శివన్నారాయణ, బాసిన దుర్గారావు శుక్రవారం కలెక్టరేట్‌లో ఏవో కె.విశ్వేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. డివిజనల్ కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చినందున అటువంటి ప్రయత్నాలను నిలుపుదల చేయాలని అధికారులు కోరినట్లు స్థల దాతలు పేర్కొన్నారు.